

న్యూస్‌రీల్

పోస్టర్లు అతికిస్తే జరిమానా తప్పదు

సదాశివపేట మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి



జరిమానా రశీదును అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ పరిధిలో రోడ్లకు ఇరువైపుల, యూటర్న్ ప్రాంతాల్లో, డివైడర్లకు వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు అతికిస్తే భారీగా జరిమానా విధిస్తామని మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి హెచ్చరించారు. పట్టణ వ్యాపారులు, రాజకీయ నాయకులు, విద్యాసంస్థలకు సంబంధించిన వారు డివైడర్‌కు, రోడ్డుకు ఇరువైపులా పోస్టర్లు, స్టిక్కర్లు అతికించవద్దని పదేపదే కోరుతున్నా పట్టించుకోకుండా అలాగే అతికిస్తున్నారన్నారు. కొంతమంది చట్టాన్ని అతిక్రమించి పోస్టర్లు, స్టిక్కర్లు అతికించిన సంగారెడ్డి పట్టణానికి చెందిన గ్లేర్ ఈవెంట్స్ వారికి రూ.4,000 జరిమానా విధించినట్లు తెలిపారు. మళ్లీ పోస్టర్లు, స్టిక్కర్లు అతికిస్తే ఇప్పటికే హెచ్చరించిన ప్రకారం రూ.50,000 వరకు జరిమానా విధించి వసూలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సదాశివపేటలో వీధికుక్కల పట్టివేత



వీధి కుక్కలను వాహనంలో తరలిస్తున్న దృశ్యం

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో తిరుగుతున్న వీధి కుక్కలను ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టుకున్నారు. పట్టణ పరిధిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్న రహమత్‌నగర్, పిట్టలకేరీ, చాపలకేరీ, చాకలి కేరీ ఏరియాల్లో మంగళవారం 130 విధి కుక్కలను పట్టుకొని పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని వివిధ కాలనీల నుంచి వచ్చిన ఫిర్యాదుల అధారంగా కుక్కల బెడద వివారణకు ప్రత్యేక చర్యలు తీసుంటున్నట్లు పేర్కొన్నారు. పట్టణ పరిధిలో ఎక్కడైనా కుక్కల బెడద ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. వీధి కుక్కలను పట్టేందుకు ప్రత్యేక బృందాలను రప్పించి పట్టించి దూర ప్రాంతాల్లో వదిలేస్తున్నట్లు తెలిపారు. వీధి కుక్కల పట్ల ప్రజలు చిన్నారులు జాగ్రత్తగా వ్యవహరించి కుక్కకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


ఆడపిల్లగా పుట్టాలి స్వతంత్రంగా జీవించాలి


మెజారిటీ మహిళలు, విద్యార్థినుల మనోగతం


సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మహిళల పట్ల సమాజంలో ఇంకా వివక్ష వీడటం లేదు. ఆడ, మగ అనే వివక్ష చిన్నప్పటి నుంచే ఎదుర్కొంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' బృందం ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక సర్వే చేపట్టింది. మూడు జిల్లాల్లో 100మందిని కలిసింది. కళాశాల విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు, గృహిణులు ఇలా వివిధ వర్గాలతో వారితో మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించింది. తమకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించగలుతున్నామని సగానికి పైగా పేర్కొనడం గమనార్హం. పూర్తిస్థాయిలో కాకపోయినా కొద్ది మేరకు స్వతంత్రంగా జీవిస్తున్నామని చెప్పిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. అతి కొద్దిమంది మాత్రమే తాము నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించలేకపోతున్నామన్నారు.


చిన్నప్పటి నుంచే వివక్ష..

- చిన్ననాటి నుంచే ఆడ, మగ వివక్షకు గురవుతున్నట్టు సర్వేలో తేలింది. మూడోవంతు చిన్నప్పుడు ఈ వివక్ష ఎదుర్కొనడంతో ఇబ్బందులు పడ్డామని చెప్పారు. కళాశాలలు, పనిచేసే ప్రదేశాలు, ప్రయాణాల్లో టీజింగ్‌కు గురైన సందర్భాలు, ఇటీవల కాలంలో వచ్చిన సోషల్ మీడియాలో టీజింగ్‌తో ఇబ్బందులు పడ్డామన్నారు.
- తమకు పూర్తిస్థాయిలో అధికారం లభిస్తే మహిళలపై జరుగుతున్న హింస, ఇతర నేరాలపై ఉక్కుపాదం మోపుతామని ఎక్కువమంది పేర్కొన్నారు.
- తల్లిగా లాలిస్తూ.. చెల్లిగా తోడుంటూ.. భార్యగా బాగోగులు చూసే మహిళలు తమకు మళ్లీ జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలనే ఎక్కువమంది భావిస్తున్నారు. మగ పిల్లాడిలా జన్మించాలని కొద్ది మంది మాత్రమే కోరుకుంటున్నట్టు సర్వేలో తేలింది.









- ఆడ మగ వివక్ష లేని సమాజం ఏర్పాటు
- మహిళలపై హింస, ఇతర నేరాలపై కఠిన శిక్షలు
- ఆడపిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు
- ఆడవారికి నెలలో 4 రోజులు పూర్తి సెలవులు (నెలసరి సమయంలో)

- చిన్నప్పుడు ఇంట్లో ఆడ, మగ వివక్ష
- కళాశాల, పనిప్రదేశం, ప్రయాణంలో టీజింగ్
- సోషల్ మీడియా టీజింగ్

సర్వే ఫలితాలు ఇలా...

కొత్త చట్టాలతోనే మహిళలకు రక్షణ



మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టాలంటే కఠినమైన కొత్త చట్టాలు తీసుకొచ్చి, పకడ్బందీగా అమలు చేయాలి. అధికార యంత్రాంగం కూడా చిత్తశుద్ధితో పనిచేయాలి. మరోవైపు సమాజంలో కూడా మార్పు రావాలి. ప్రతి ఒక్కరూ మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలి.

– శ్రీదేవి, ఉపాధ్యాయురాలు, పటాన్‌చెరు

మా నాన్న మగపిల్లాడు పుట్టలేదని బాధపడలేదు



మేం ఇద్దరం ఆడపిల్లలం. మా నాన్న ఎన్నడూ మగపిల్లాడు పుట్టలేదని బాధపడలేదు. ఆడపిల్ల అయినంత మాత్రాన ఎందులోనూ తక్కువకాదు. ఏసమయంలోనైనా, అధైర్యపడొద్దని చెప్పేవారు. ఎవరైనా అడిగినప్పుడు కొడుకు ఏం గొప్పకాదని చెప్పినప్పుడు కూతుళ్లగా మాకు ఎంతో గర్వంగా ఉండేది.

– సుస్మిత, విద్యార్థిని, మెదక్

అమ్మాయిలు దేనిలో తక్కువ కాదు



నేటి సమాజంలో అబ్బాయిలతో పోల్చుకుంటే అమ్మాయిలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. అన్నింటికి మించి మరోబిడ్డకు జన్మనిచ్చే అదృష్టం ఒక అమ్మాయికే ఉంది. అందుకే మరో జన్మంటూ ఉంటే నేను మళ్లీ ఆడపిల్లగానే పుడతాను. ఆడపిల్లల పుట్టడం ఎంతో గర్వంగా ఫీల్ అవుతాను.

–గంగోత్రి, విద్యార్థిని, మెదక్

అవకాశాలను సృష్టించుకోవాలి



సృష్టికి మూలం స్త్రీలు. ప్రతీ మహిళ స్వేచ్ఛగా బతకాలి. స్థిరమైన ఆలోచనలు కలిగిఉండాలి. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి. మహిళలు, యువతులు సమాజంలో నిలదొక్కుకునేందుకు వారే నూతన ఆలోచనలు, అవకాశాలు సృష్టించుకోవాలి. చదువుతోనే మహిళల సాధికారత సాధ్యమవుతుంది.

–సరోజ, సిద్దిపేటజిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి

తాగిన మైకంలో పెట్రోల్ పోసి నిప్పంటించాడు

- బాధితుడి పరిస్థితి విషమం .. గాంధీ ఆస్పత్రికి తరలింపు
- హోలీ వేడుకల్లో విషాదం

రేగోడ్(మెదక్): తాగిన మైకంలో ఉన్న వ్యక్తితో సరదాగా మాట్లాడిన సంభాషణే ఒకరి ప్రాణం మీదకు తెచ్చింది. మెదక్ డీఎస్పీ సైదులు చెప్పిన వివరాల ప్రకారం.. రేగోడ్ మండలం మర్పల్లి గ్రామంలో మంగళవారం హోలీ వేడుకలు జరుపుకున్నారు. గ్రామానికి చెందిన అంబాదాస్ హోలీ ఆడిన తర్వాత స్నానం చేయడానికి చెరువు వద్దకు బైక్‌పై వెళుతుండగా, పెట్రోల్ అయిపోయింది. ఇంటికి తిరిగొచ్చి పెట్రోల్ డబ్బాతో చెరువు వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎదురుపడిన షబ్బీర్‌తో నీపై కలర్ వేస్తా బావా అని అంబాదాస్ అన్నాడు. నీవు పోసేది ఏందిరా నేనే పోస్తా అంటూ అంబాదాస్ చేతిలో ఉన్న పెట్రోల్ డబ్బాను షబ్బీర్ తీసుకున్నాడు. అయితే అందులో పెట్రోల్ ఉన్న విషయం చెబుదామనుకునులోపే అంబాదాస్‌పై పెట్రోల్ పోసి షబ్బీర్ నిప్పంటించాడు. ఆ సమయంలోనే షబ్బీర్ తాగి ఉన్నాడు. అక్కడే ఉన్న స్థానికులు అంబాదాస్‌కు అంటుకున్న మంటలను ఆర్పారు. వెంటనే నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగానే ఉంది. ఈ విషయం తెలుసుకున్న మెదక్ డీఎస్పీ సైదులు, అల్లాదుర్గం సీఐ జార్జి, అల్లాదుర్గం, రేగోడ్ ఎస్ఐలు ప్రవీణ్‌రెడ్డి, సత్యనారాయణ, సిబ్బందితో ఘటనా స్థలికి చేరు కుని వివరాలు సేకరించారు. అంబాదాస్ అక్క శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. షబ్బీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



కాలిన గాయాలతో అంబాదాస్

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి



మాట్లాడుతున్న ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. నాగల్‌గిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, దశరథ్, హెచ్ఎం భాస్కర్, రమేశ్‌పాటిల్, ఎంపీడీఓ రాజశేఖర్, కసర్‌గుత్తి సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, కృష్ణ జాదవ్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు రాజీలేని పోరాటం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్

సంగారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణకు రాజీలేని పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ కుమార్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నందున మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జహీరాబాద్‌లో మొదలైన మాదిగల సంగ్రామ పాదయాత్ర ఎనిమిదవ రోజుకు సంగారెడ్డిలోని ఫసల్‌వాది గ్రామానికి మంగళవారం చేరుకుంది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలకు ఇచ్చిన హామీని అమలు చేయలేని, బీజేపీతో తాడోపేడో తెల్చుకోవడానికి మాదిగలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 28 ఏళ్ల ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చాక పార్లమెంట్‌లో బిల్లు పెట్టడాన్ని విస్మరించడం దుర్మగమైన చర్య అన్నారు. తెలంగాణలో అధిక జనాభా కలిగిన మాదిగలను దూరం చేసుకొని బీజేపీ ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తామని హెచ్చరించారు. బీజేపీ రాజకీయ పతనం మాదిగలతోనే మొదలవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తునేఉంటామని తెలిపారు. మాదిగల సంగ్రామ పాదయాత్ర ఏప్రిల్ నాలుగు వరకు పటాన్‌చెరు వరకు కొనసాగుతుందన్నారు. అదే రోజు హైదరాబాద్ – ముంబై జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మైసగళ్ల బుచ్చంద్ర, ఎంఎస్ఎఫ్ సీనియర్ నాయకులు అరకల రమేశ్‌మాదిగ, ప్రశాంత్ మాదిగ, నవీన్ మాదిగ, చెకిరాకల్ ప్రశాంత్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

హోలీ కేళీ..



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలో చిన్నారుల సందడి

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం రాత్రి కాముడి దహనం తర్వాత ఒకరికొకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మంగళవారం ఊరూరా యువకుల సందడి కనిపించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గుంపులు గుంపులుగా తిరుగుతూ సంబురాలు జరుపుకున్నారు.

సంగారెడ్డి టౌన్:



జహీరాబాద్: హోలీ వేడుకల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

సర్వోదయంతో నిలబడ్డారు

మల్టీనేషనల్ కంపెనీలతో పోటీ పడుతున్న వనితలు

- కాస్మోటిక్స్, నూనెల తయారీ, విక్రయంలో ముందంజ
- పప్పుదినుసుల ప్రాసెసింగ్‌లోనూ రాణిస్తున్న గొంగ్లూరు మహిళలు



పప్పుదినుసులను ప్రాసెసింగ్ చేస్తున్న సర్వోదయ మహిళలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: వారంతా గ్రామీణ ప్రాంత మహిళలే.. కానీ గృహ అవసరాల ఉత్పత్తుల రంగంలో మల్టీ నేషనల్ కంపెనీలతో పోటీ పడుతున్నారు. సాధారణ గృహిణులే అయినా ఊరంతా సంఘటితమై కుటీర పరిశ్రమలను స్థాపించుకొని మహిళా పారిశ్రామికవేత్తలుగా మారారు. వారు ప్రారంభించిన పరిశ్రమల్లో వారే కార్మికులుగా పనిచేస్తూ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటున్నారు.

- పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామానికి చెందిన 126 మంది మహిళలు ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సర్వోదయ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సంస్థ స్థాపించారు. గ్రామంలో మూడు కుటీర పరిశ్రమలను నెలకొల్పారు. సాధారణ గృహిణులు కాస్త మహిళా పారిశ్రామికవేత్తలుగా మారారు.
- 'సర్వోదయ మంజీరా' బ్రాండ్ పేరుతో చేతితో చేసిన 15 రకాల సబ్బులను ఉత్పత్తి చేస్తున్నారు. రసాయనాలతో తయారయ్యే సాధారణ సబ్బులకు భిన్నంగా టమాటా, బొప్పాయి వంటి నేచురల్ ఉప ఉత్పత్తులతో ఈ సబ్బులను తయారు చేస్తున్నారు. ఈ కుటీర పరిశ్రమల్లో కోల్డ్‌ప్రెస్ వంటనూనెలు కూడా ఉత్పత్తి చేస్తున్నారు. పల్లి, పొద్దుతిరుగుడు, నువ్వుల, కొబ్బరినూనెలను తయారు చేసి, ప్రత్యేకంగా ప్యాకింగ్ చేస్తున్నారు. అన్ని రకాల పప్పుదినుసులను ప్రాసెసింగ్ చేసి, మార్కెటింగ్ చేస్తున్నారు. ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్‌తో పాటు సుమారు 60 మంది వైద్యులు ఈ సంస్థకు ఆర్థిక, ఇతర సహాయ, సహకారాలు అందిస్తున్నారు.

పోటీని తట్టుకొని..

కాస్మోటిక్స్ ఉత్పత్తులైన సబ్బులతో పాటు వంట నూనెల్లో ప్రస్తుత మార్కెట్‌లో మల్టీనేషనల్ కంపెనీలు గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. అలాంటి కంపెనీల పోటీని తట్టుకొని మార్కెట్‌లో నిలబడుతున్నారు గొంగ్లూరు సర్వోదయ మహిళా పారిశ్రామిక వేత్తలు. బహుళ జాతి సంస్థల ఉత్పత్తుల మాదిరిగానే ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), జీఎంపీ (గుడ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రొడక్ట్) వంటి జాతీయ సంస్థల లైసెన్స్‌లు తీసుకున్నారు. హ్యాండ్‌మేడ్ సబ్బులు వంటి కాస్మోటిక్స్ ఉత్పత్తుల కోసం ఆయూష్ విభాగం నుంచి కూడా లైసెన్స్ పొందారు.

రూ.60 లక్షలు దాటిన టర్నోవర్..

సర్వోదయ ఉత్పత్తులు మార్కెట్‌లోకి వచ్చిన అతికొద్ది నెలల్లోనే ఈ సంస్థ టర్నోవర్ రూ.60 లక్షలు దాటిందని సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. తామ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు sarvodayasmanjeera.com ఈ – కామర్స్ ప్లాట్‌ఫాంను కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ తీసుకొని సరుకులు సరఫరా చేస్తున్నారు. మరోవైపు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రధాన వ్యాపార కూడలిలో ఔట్‌లెట్‌ను కూడా ఏర్పాటు చేసుకొని సరుకులు విక్రయిస్తున్నారు. మాన్యుఫ్యాక్చరింగ్‌తో పాటు, మార్కెటింగ్‌లోనూ ముందుంటున్నారు.

జయశంకర్ యూనివర్సిటీతో ఒప్పందం

ప్రస్తుతం చిరుధాన్యాలకు ఆదరణ పెరుగుతోంది. 2023ను ప్రపంచ మిల్లెట్స్ ఇయర్‌గా గుర్తించబడిన విషయం అందిరికి తెలిసిందే. ప్రజల అభిరుచులకు అనుగుణంగా చిరుధాన్యాలను ప్రాసెసింగ్ విభాగంలోకి ఈ సర్వోదయ మహిళా సంస్థ అడుగుపెట్టింది. ఈ చిరుధాన్యాలను సేకరించి, వాటిని ప్రాసెసింగ్ చేసి, విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇందుకు అవసరమైన టెక్నాలజీ, శిక్షణ కోసం ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నట్లు ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్ పేర్కొన్నారు.

చిన్నచిన్న పెట్టుబడులతో పరిశ్రమ పెట్టుకున్నాం



డ్వాక్రా గూపులో లోన్లు తీసుకొని ఈ పరిశ్రమలో పెట్టుబడి పెట్టాం. ఒక్కొక్కరం రూ.50 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు పెట్టుబడితో సభ్యులుగా చేరాం. ఇందుకు ఐఆర్ఎస్ అధికారుల సహకారంతో సబ్బులు, నూనెలు తయారు చేసి అమ్ముతున్నాం. వచ్చిన లాభాలు మాకే చెందుతాయి. ఎంతో ఉత్సాహంతో పని చేసుకుంటున్నాం.

– ఎస్.చంద్రకళ, సర్వోదయ సభ్యురాలు

క్లుప్తంగా

బైక్ చోరీ


దుండగులు ఎత్తుకెళ్లిన బైక్

నర్సాపూర్: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్‌కు చెందిన మల్లికార్జున్ పట్టణంలోని శివాలయం వీధిలో నివాసం ఉంటున్న తమ బంధువు కుమ్మరి రాజు ఇంటికి సోమవారం వెళ్లాడు. రాత్రి అక్కడ తన బైక్‌ను పార్కు చేశాడు. మంగళవారం ఉదయం చూసే సరికి పార్క్ చేసిన టీఎస్ 35 2833 నంబరుగల బైక్ కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

పాపన్నపేట(మెదక్): తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రమైన పాపన్నపేటలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దర్జీ శ్రీహరి కుటుంబీకులు రెండు రోజుల క్రితం బాసర సరస్వతీ దేవి దర్శనానికి వెళ్లారు. ఇంట్లో శ్రీహరి ఒక్కడే ఉన్నాడు. సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి దర్జీపని చేసేందుకు దుకాణానికి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చి చూడగా ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటం గమనించాడు. అనుమానంవచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో దాచిన బంగారు ఆభరణాలు గుర్తులు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రహించాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిల్‌లో ఈగ ప్రత్యక్షం



కౌడిపల్లి(నర్సాపూర్): మద్యం బాటిల్‌లో ఈగ కనిపించడంతో మందుబాబులు విస్మయానికి గురయ్యారు. మండల కేంద్రమైన కౌడిపల్లిలోని రోజారెడ్డి వైన్స్‌షాప్‌లో చనిపోయిన ఈగ ప్రత్యక్షం అయింది. మంగళవారం మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి వైన్స్‌షాప్‌లో మద్యం కొనుగోలు చేశాడు. సీల్ ఉన్న బాటిల్‌లో ఈగ కనిపించడంతో వైన్స్ నిర్వాహకుడు మరోబాటిల్ ఇచ్చాడు. ఈ విషయంపై వైన్స్ యజమాని వివరణ కోరగా కంపెనీ నుంచి సీల్ ఉన్న బాటిల్‌లో వచ్చిందని, అధికారులకు తెలియచేస్తామని చెప్పాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం


నరేశ్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: ఇంటి నుంచి వెళ్లిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన నరేశ్(30) బతుకుదెరువు కోసం వచ్చాడు. అమీన్‌పూర్ పట్టణం సృజన లక్ష్మీసాయి మీడోస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. హైదరాబాద్ టీసీఎస్‌లో పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా మతిమరుపుతో ఇబ్బంది పడుతుండటంతో వరంగల్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, స్థానికులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో సోదరుడు దివాకర్ మంగళవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికి వెలుగు.. జగతికి జ్యోతి

- గ్రామాల్లో ఆడపిల్ల పుడితే సంబురాలు
- సుకన్య సమృద్ధి యోజనలో చేరిక
- పుట్టిన పిల్లపేరిట రూ.5 వేలు జమ



ఆడపిల్ల పుడితే భారం అనుకునే కుటుంబాలకు గ్రామపంచాయతీలు భరోసా ఇస్తున్నాయి. కొన్ని పంచాయతీల్లో ఆడపిల్ల పుట్టిన వెంటనే సంబురాలు జరుపుకుంటున్నారు. ఆ దంపతులకు స్వీట్లు పంచిపెట్టి తామున్నామంటూ ధైర్యం చెబుతున్నారు. పుట్టిన బిడ్డ పేరిట సుకన్యసమృద్ధిలో రూ.5 వేలు జమ చేస్తున్నారు. తమకు కూతురు పుట్టిందనే బెంగలేకుండా చేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


హరిదాస్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు, బాలికలు (ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): ఆ గ్రామంలో ఆడపిల్ల పుడితే ఊరంతా వేడుక చేసుకుంటారు. పంచాయతీ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. మిఠాయి పంచిపెడతారు. అదే కొండాపూర్ మండలంలోని హరిదాస్‌పూర్. 2020 జనవరి 1వ తేదీన గ్రామంలో పల్లెప్రగతిపై అవగాహన కల్పించేందుకు ప్రతీ ఇల్లు తిరుగుతున్నారు. అలా తిరుగుతూ వార్డు సభ్యులు, యువకులు, సర్పంచ్, కార్యదర్శి ఓ ఇంట్లోకి వెళ్లారు. ఆ ఇంటి పెద్దావిడ విచారంగా కూర్చుంది. ఏమైందని అడగటంతో మా కూతురుకు మళ్లీ ఆడపిల్ల పుట్టింది చెప్పింది. తనకు ముగ్గురూ ఆడపిల్లలేనని, ఇప్పుడు నా కూతురుకు కూడా ఆడపిల్లలే అంటూ ఆవేదన వ్యక్తం చేసింది కమలమ్మ

భారం కాకూడదని

కమలమ్మ కుటుంబంలాగా గ్రామంలో ఏ కుటుంబం బాధ పడకూడదని, అటువంటి కుటుంబాలకు భరోసా కల్పించాలని పంచాయతీ సభ్యులు నిర్ణయించుకున్నారు. అనుకుందే తడవుగా సాయంత్రం పంచాయతీ కార్యాలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించి ఆ దంపతులను పిలిచి స్వీట్లు పంచి పెట్టారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా నెలకు రూ. 250 చొప్పున నాలుగు నెలలపాటు చెల్లించారు. ఇప్పటివరకు హరిదాస్‌పూర్‌లో 85 మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేరి ప్రతీ నెల డబ్బులు చెల్లిస్తున్నారు.

హరిదాస్‌పూర్ స్ఫూర్తితో..

ఎక్కడ స్త్రీ గౌరవింపబడుతుందో ప్రాంతం అంతా సిరిసందలతో తులతూగుతుందని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ స్వయంగా గ్రామానికి వచ్చి కన్యావందన కార్యక్రమాన్ని నిర్వహించారు. హరిదాస్‌పూర్ గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకొని కొండాపూర్ మండలంలోని శివన్నగూడ, కంది మండలం ఎద్దు మైలారం గ్రామాలలోనూ అమ్మాయి పుడితే సంబురాలు జరుపుకుంటున్నారు.

గర్వంగా ఉంది



ఏ ఇంటికీ ఆడపిల్ల భారం కాకూడదనీ తీసుకున్న ఈ నిర్ణయం మా ఊరు రూపు రేఖలనే మార్చేసింది. అందుకు చాలా గర్వంగా ఉంది. ప్రతీ ఒక్కరూ ఆడపిల్లలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వారికిష్టమైన రంగాలలో ముందుకు వెళ్లేలా ప్రోత్సహించాలి.

– షఫీ, సర్పంచ్, హరిదాస్‌పూర్

కులమతాలకతీతంగా..

జహీరాబాద్ టౌన్: ఆడబిడ్డ భవిష్యత్‌కు ఆ గ్రామ సర్పంచ్ నగదు అందజేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామంలో ఆడపిల్ల పుట్టినా, పెళ్లి జరిగినా గ్రామ సర్పంచ్ హైదరాబాద్ ఈశ్వర్‌రెడ్డి రూ.5 వేల నగదు ఇస్తున్నారు. సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత గ్రామాభివృద్ధితో పాటు ఆడపిల్లల పెళ్లికి తన వంతు రూ.5వేల నగదు ఇస్తానని ప్రకటించారు. తాను సర్పంచ్‌గా కొనసాగినన్ని రోజులు నగదు ఇస్తానన్నారు. కులమతాలకతీతంగా నాలుగేళ్లుగా నగదు అందజేస్తున్నారు. ఇలా 50 మందికి ఇప్పటికి వరకు అందజేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.


వధువుకు చెక్కు అందజేస్తున్న సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి (ఫైల్)

ఆడబిడ్డ పుడితే రూ.10,116


నగదు అందుకున్న చిన్నారుల తల్లులతో ప్రకాశ్‌చారి

జిన్నారం(పటాన్‌చెరు): ఆడబిడ్డ పుడితే రూ.10,116 అందించేందుకు మండలంలోని గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశ్‌చారి ముందుకు వచ్చారు. ఏటా ఆగస్టు 15వ తేదీన ఆడబిడ్డ పుట్టిన తల్లులకు నగదు అందజేస్తున్నారు. రెండేళ్ల నుంచి 47 మంది ఆడపిల్ల పుట్టిన తల్లులకు నగదు అందించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లీనగర్, చెట్లపోతారం, గడ్డపోతారం, కిష్టాయిపల్లి గ్రామాల్లో ఆడపిల్ల పుడితే నగదు అందించేలా చర్యలు చేపట్టారు.

అండగా ఉండేందుకే..



ఆడపిల్లలు పుడితే భారం అనుకుంటున్న తల్లిదండ్రులకు అండగా ఉండేందుకు నావంతు సాయం అందిస్తున్నాను. ఈ ఏడాది నుంచి పుట్టిన చిన్నారి పేరిట నగదును పెంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుందామనుకుంటున్నా.

– ప్రకాశ్‌చారి, సర్పంచ్ గడ్డపోతారం

ఆడబిడ్డ పుట్టిన తల్లిదండ్రులకు భరోసా

పటాన్‌చెరు టౌన్: అమ్మాయి పుడితే భారంగా భావిస్తున్న రోజులవి. ఇలాంటి సమాజంలో కూతురు పుట్టడం వరమంటున్నారు పటాన్‌చెరు మండలం చిట్కుల్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సర్పంచ్ నీలం మధు ముదిరాజ్. ఆడబిడ్డ పుట్టిన తల్లిదండ్రులకు అభయం ఇచ్చేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చిట్కుల్ గ్రామంలో ఆడపిల్ల పుడితే రూ.5 వేలు ఇస్తానని గత ఏడాది మంత్రి హరీశ్ రావు జన్మదిన వేడుకల్లో ప్రకటించారు. గత ఏడాది జూన్ 3వ తేదీన హరీశ్ రావు జన్మదిన వేడుకల్లో 14 మంది ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు రూ.5 వేలు చొప్పున అందజేశారు.

మంత్రి కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్

మంత్రి కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా గతేడాది మంత్రి హరీశ్‌రావు జన్మదినం రోజున చిట్కుల్‌లో ఆడపిల్ల పుడితే రూ.5 వేలు ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా గత ఏడాది జూన్ 2వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 1వ వరకు గ్రామంలో 32 మంది తల్లులు ఆడబిడ్డలకు జన్మనిచ్చినట్లు వివరాలు సేకరించారు. వారికి ఈనెల 16వ తేదీన వేడుక నిర్వహించి నగదు అందజేస్తామని నీలం మధు ముదిరాజ్ తెలిపారు.


చిట్కుల్‌లో ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులకు నగదు అందజేస్తున్న నీలం మధు ముదిరాజ్ (ఫైల్)

ఆడపిల్లకు పీఎంఆర్ కానుక

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామంలో ఆడపిల్ల పుడితే పీఎంఆర్ కానుకు అందజేస్తున్నారు మండల పరిధిలోని మేదపల్లి గ్రామ సర్పంచ్ పరమేశ్వర్‌పాటిల్. కొన్నేళుగా పుట్టిన ఆడపిల్లకు పాపకు ప్రేమతో పీఎంఆర్ కానుక రూపంలో రూ.1116 నగదు, స్వీటు బాక్సు, ఆటవస్తువులను ఇస్తున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 60 మందికి ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆడపిల్ల తల్లులకు కానుకలను మండల అధికారుల చేతుల మీదుగా అందజేస్తుండటం విశేషం.


మేదపల్లి : కానుకలు అందిస్తున్న పరమేశ్వర్ పాటిల్, డాక్టర్ మాజీద్ తదితరులు (ఫైల్)

అంకితభావంతో.. అన్నీ తానై

- పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన
- గర్భిణులు, తల్లులకు ఆరోగ్యలక్ష్మీ భోజనం అందజేత
- కిచెన్ గార్డెన్ నిర్వహణ
- అంగన్‌వాడీ ఆయా రజియాకు రాష్ట్ర స్థాయి అవార్డు


కౌడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశం నిర్వహిస్తున్న రజియా సుల్తానా

కౌడిపల్లి(నర్సాపూర్): చిన్నారులకు, గర్భిణులు, తల్లులకు అన్ని తానై అంగన్‌వాడీ సేవలందిస్తోంది. ఆమె సేవలను సర్కార్ గుర్తించింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. ఐసీడీఎస్‌లో గతంలో జిల్లాలో ఎవరూ పొందని గుర్తింపు పొందింది కౌడిపల్లి అంగన్‌వాడీ ఆయా రజియా సుల్తానా.

2007లో విధుల్లోకి..

కౌడిపల్లికి చెందిన రజియా సుల్తానా కౌడిపల్లిలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో 2007లో ఆయాగా విధుల్లోకి చేరింది. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతీ రోజు పిల్లలను తీసుకురావడం, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు భోజనం వండి పెట్టడం, కేంద్రాన్ని శుభ్రం చేయడం వంటి పనులు చేసేది. టీచర్ బదిలీపై వెళ్లడంతో చిన్నారులకు మూడు నెలలుగా పాఠాలు బోధిస్తోంది. కిచన్ గార్డెన్ నిర్వాహణతో పాటు కేంద్రాన్ని ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ అందరి ప్రశంసలు అందుకుంటోంది.

అవార్డు రావడం సంతోషంగా ఉంది



కౌడిపల్లిలోని 4వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సంతోష పదోన్నతిపై వెళ్లింది. సూపర్‌వైజర్‌గా ఆమె సూచనలతో కేంద్రాని నిర్వహిస్తున్నా. కేంద్రానికి వచ్చిన పిల్లలు, తల్లులకు సేవలందిస్తున్నా. గతంలో మా టీచర్‌కు ఎన్నో అవార్డులు వచ్చాయి. ఇప్పుడు నాకు కూడా అవార్డు రావంతో సంతోషంగా ఉంది.

– రజియా సుల్తానా, అంగన్‌వాడీ ఆయా, కౌడిపల్లి

వైఎస్సార్ గ్రూపు ఆదర్శం

- మంజీర ప్రొడక్ట్స్ పేరుతో ఉత్పత్తులు
- మార్కెట్‌లో విక్రయిస్తూ లాభాల ఆర్జన
- ఇతర గ్రూపులకు రోల్ మోడల్

మెదక్‌జోన్: ఆ మహిళా సంఘ సభ్యులు మూడేళ్లుగా డిటర్జంట్ పౌడర్, ఫినాయిల్, ఫ్లోర్ క్లీనర్ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్‌లో విక్రయిస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. జిల్లాలోని ఇతర మహిళా సంఘాలకు ఆదర్శంగా నిలిచారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్కల గ్రామంలో 15 ఏళ్ల క్రితం ఆరుగురు మహిళా సభ్యులు వైఎస్సార్ పేరుతో సంఘం ఏర్పాటు చేసుకున్నారు.

- మొదట్లో అందరిలాగే రొటీన్‌గా రుణాలు తీసుకుని చిన్నచిన్న పనులు చేసుకునేవారు. ఆ తర్వాత కొత్తగా ఏదైన వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు.
- అనుకున్నదే తడువుగా మండల సమాఖ్య ద్వార రూ.2 లక్షల రుణం తీసుకున్నారు. అందులో రూ.1.50 లక్షలు వెచ్చించి మిషన్లు కొనుగోలు చేశారు. మరో రూ. 50 వేలు వెచ్చించి ముడిసరుకును హైదరాబాద్‌లో కొనుగోలు చేశారు.
- మంజీరా పేరుతో డిటర్జంట్ పౌడర్, ఫినాయిల్, ఫ్లోర్ క్లీనర్ తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్లో విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు.
- కిలో సర్ఫ్ ప్యాకెట్‌పై రూ.30 ఆదాయం పొందుతునట్లు తెలిపారు. అలాగే మిగిలిన ఉత్పత్తులు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ సంఘం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు నేడు జిల్లా నలుమూల్లో విక్రయిస్తున్నారు.
- అంతేకాకుండా గ్రామాల్లో సమాఖ్య సమావేశాలు, మండల, జిల్లా స్థాయి సమావేశాలప్పుడు మహిళా సంఘాల సభ్యులు వైఎస్సార్ గ్రూపు మహిళా సంఘం సభ్యులు తయారు చేసే మంజీర ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ సంఘం సభ్యులు రెట్టింపు ఉత్సాహంతో వ్యాపారం చేస్తున్నారు.


వైఎస్సార్ గ్రూపు సభ్యులు తయారు చేస్తున్న ఫినాయిల్

త్వరలో ఇల్లుకట్టుకుంటా



మంజీర ప్రొడక్ట్స్ పేరుతో డిటర్జంట్ పౌడర్, ఫినాయిల్, ఫ్లోర్‌క్లీనర్ లిక్విడ్ తయారు చేస్తున్నాం. ఇందుకోసం రెండు రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ పొందాం. ఈ ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తున్నాం. మా వ్యాపారం బాగా నడుస్తోంది. త్వరలో ఇల్లు కట్టుకుంటా.

– నవనీత, వైఎస్సార్ గ్రూపు అధ్యక్షురాలు,పెద్దగొట్టిముక్కల

మరింత విస్తరిస్తాం



మంజీర ప్రోడక్స్‌కు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. మాకు ఎలాంటి ప్రచారం లేకుండానే విక్రయాలు బాగా జరుగుతున్నాయి. ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. వ్యాపారం మరింత విస్తరిస్తాం.

– రేణుక
వైఎస్సార్ గ్రూపు సభ్యురాలు పెద్దగొట్టిముక్కల

మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు సీజ్

జోగిపేట(అందోల్): మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. అందోల్ శివారులోని నర్సరీ వెనుక మొరంను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఆ ప్రాంతానికి వెళ్లగా వాహనాల్లో మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించారు. మూడు టిప్పర్లు, మూడు జేసీబీలను స్వాధీనపరచుకున్నట్లు ఎస్ఐ 2 పెంటయ్య మంగళవారం తెలిపారు. పోలీసులను రావడంతో వాహన డ్రైవర్లు పారిపోయారు. మట్టిని తరలిస్తున్న విషయం తెలుసుకున్న జోగిపేట మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి వరకు మొరం తరలింపుపై ఇరువర్గాలు ఘర్షణ పడినట్లు సమాచారం. కాగా వాహనాలు ఎవరివనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యాచకుడి మృతి


గుర్తుతెలియని యాచకుడి మృతదేహం

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో గుర్తుతెలియని యాచకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవికాంత్ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద నెల నుంచి గుర్తుతెలియని మూగ వ్యక్తి భిక్షాటన చేస్తూ ఆలయం వద్ద నున్న బస్టాండ్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు పడుకొని ఉండటంతో గుర్తించిన తోటి యాచకులు అతడి వద్ద వెళ్లి చూడగా మృతిచెంది కనిపించాడు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. మృతుడు వయస్సు 36 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భారతీనగర్ డివిజన్ పరిధి పాత ఎంఐజీ కాలనీ శివారులోనీ బీహెచ్ఈఎల్‌లో మూతబడిన డ్రైనేజీ సంపులో గుర్తుతలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం సాయంత్రం మృతదేహాన్ని బయటకి తీశారు.

మృతుడి జేబులో లభించిన ఫోన్ బుక్ ఆధారంగా పటాన్‌చెరులో నివాసముండే బీహార్‌కు చెందిన జితేంద్రకుమార్ శర్మగా గుర్తించారు. మృతుడు కూలి పనులు చేస్తున్నాడు. కాగా ఇక్కడికి వచ్చి ఎలా మృతి చెందాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని, నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

స్నేహితుడి కోసం వెళ్లిన వ్యక్తిపై దాడి

పటాన్‌చెరు టౌన్: రూ.ఐదు వేల అప్పు గొడవలో స్నేహితుడి కోసం వెళ్లి మాట్లాడితే ఆ యువకుడిపై దాడి చేసి తల పగలగొట్టిన ఘటనలో యువకుడికి తొమ్మిది కుట్లు పడ్డాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సాయి కాలనీకి చెందిన ప్రవీణ్ అనే యువకుడికి ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి పటాన్‌చెరు పట్టణంలోని అల్విన్‌కాలనీలో ఉండే స్నేహితుడు రూపేశ్‌సింగ్ ఫోన్ చేశాడు. అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్‌కు చెందిన కలీంతో పాటు అమీర్, షేఖ్‌గౌస్‌లు కారులో వచ్చి తనను తీసుకొని వెళ్తున్నారని ఫోన్ చేయడంతో ప్రవీణ్ స్నేహితుడి కోసం పటాన్‌చెరు వచ్చి బస్టాండ్ సమీపంలో స్నేహితుడు ఉన్నట్లు తెలుసుకొని ఘటనా స్థలానికి వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లిన ప్రవీణ్ నా స్నేహితుడి ఈ సమయంలో ఎందుకు కారులో తీసుకెళ్తున్నారని అడగటంతో అప్పుడే ఘటనా స్థలానికి బైక్‌పై వచ్చిన కలీం స్నేహితుడు లడ్డు అనే వ్యక్తి తన వెంట తెచ్చుకున్న రాడ్‌తో ప్రవీణ్ తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో ప్రవీణ్ తల పలగగా చికిత్స కోసం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు తొమ్మిది కుట్లు వేశారు. తర్వాత బాధితుడు ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొనసాగుతున్న ఈదులనాగులపల్లి కేసు దర్యాప్తు

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో చోటుచేసుకున్న ఘటనపై వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మూడో వ్యక్తి ఎవరైనా వచ్చి తుకననాయక్, నిరుదలై, అబదలైలను తీవ్రంగా కొట్టి బిసుదలై అలియాస్ బిస్వనాథ్‌దలైను హత్య చేశాడా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. ఇందులో చనిపోయిన వ్యక్తితోపాటు గాయపడిన మరో ఇద్దరు ఒకటే ఊరు కావడం, మరొకరిది వేరే గ్రామం కావడంతో వీరి కుటుంబాల మధ్య పాత కక్షలు కూడా ఉండటంతో కొద్ది రోజుల క్రితం వచ్చిన బిసుదలై కావాలనే పథకం ప్రకారం ఇలా చేశాడా అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. మృతుడు, గాయపడిన వారి బంధువులను కూడా ఒడిశా నుంచి రప్పించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు భానూర్ - బీడీఎల్ పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ఫోన్ డేటాను, సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ: దంపతులకు గాయాలు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని సిద్దిపేట మార్గంలో మల్లెచెరువు కట్టపై మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా ఇందల్వాయి మండలం నల్లేపల్లి గ్రామానికి చెందిన తిరుడు స్వామి, కళావతి దంపతులు బైక్‌పై దౌల్తాబాద్ వెళ్తున్నారు. మల్లెచెరువు కట్టపై మరో బైక్ ఢీకొట్టడంతో వారు గాయపడ్డారు. ఈ మేరకు ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని కుప్పానగర్ గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో న్యూ స్టార్ యువజన సంఘాల సహకారంతో జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా వైద్యులు 300 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు జోహార్ కెనడీ, గ్రామస్తులు రాజ్‌కుమార్, పండరీనాథ్, శంకరయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు